నేటితో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి

ప్రజాశక్తి - నరసాపురం

సీతారామపురం స్వర్ణాంధ్ర కళాశాలలో పాలిసెట్-2025 ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఈ నెల 21 నుండి నిర్వహిస్తున్న సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 28వ తేదీతో ముగుస్తుందని ఆ కళాశాల ప్రిన్సిపల్, హెల్ప్‌లైన్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ కిరణ్మయి తెలిపారు. ఈ ప్రవేశాల్లో పరిశీలన పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 30వ తేదీ నుండి వెబ్ ఆప్షన్ నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. పాలిటెక్నిక్ విద్యపై ఆసక్తి కలిగిన విద్యార్థులు మరిన్ని వివరాలకు తమ కళాశాలలోని పాలిటెక్నిక్ కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. పాలిసెట్‌లో ర్యాంక్ పొందిన విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ఛైర్మన్ కొండవీటి సత్యనారాయణ, ట్రెజరర్ కెవి.స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి తెలిపారు.

ఆఖరులో హడావుడి..!

- మూడు రోజుల్లో ముగియనున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలు
- హడావుడిగా ఉద్యోగులను పిలిచి తూతూమంత్రంగా ప్రక్రియ
- ఇప్పటికే నేతలు చెప్పినట్లు బదిలీల జాబితా సిద్ధం చేసినట్లు ప్రచారం
- గ్రేడ్-5, 6 సచివాలయ కార్యదర్శులను పిలిచి ఆప్షనల్ ఫారం స్వీకరణ
- నేడు, రేపు మరిన్ని శాఖల ఉద్యోగులకు జిల్లా కేంద్రానికి పిలుపు
- డిఎస్‌సి పరీక్షల నేపథ్యంలో ఉద్యోగులు సతమతం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియలో ఏమాత్రం పారదర్శకత లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా సచివాలయ ఉద్యోగుల బదిలీలు పూర్తిగా రాజకీయ నాయకుల కనుసన్నల్లో సాగుతోంది. దీంతో ఉద్యోగులకు అసలు ఏం జరుగుతుందో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే రాజకీయ నాయకులు చెప్పినట్లు బదిలీల జాబితాలు తయారైపోయాయని, ఇప్పుడు జరుగుతున్న తతంగమంతా తూతూమంత్రమే అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బదిలీకి సంబంధించిన ఉత్తర్వులు వెలువడి దాదాపు 20 రోజులు కావొస్తున్నా పట్టించుకోని ఆయా శాఖల అధికారులు, మూడు రోజుల్లో గడువు ముగుస్తుందనగా హడావుడి చేస్తున్న పరిస్థితి ఉంది. దీంతో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలపై తీవ్ర విమర్శలు నెలకొన్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు 1100 వరకూ గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. 8,500 మంది వరకూ ఉద్యోగులు పని చేస్తున్నారు. బదిలీల పూర్వంన ప్రతి సచివాలయ ఉద్యోగి బదిలీ కావాల్సిందేనని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మూడొంతులు మంది ఉద్యోగులకు బదిలీలు తప్పనిసరిగా మారింది. ఈ నెల 12న బదిలీల ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇప్పటి వరకూ బదిలీల ప్రక్రియను అధికారులు ప్రారంభించలేదు. మరో మూడు రోజుల్లో గడువు ముగుస్తుందనగా ఇప్పుడు సచివాలయ ఉద్యోగులను జిల్లా కేంద్రానికి పిలిచి హడావుడి చేస్తున్న పరిస్థితి ఉంది. ఈ నెల 27న శుక్రవారం సచివాలయాల్లోని గ్రేడ్-5, 6 కార్యదర్శులకు ఏలూరు జిల్లా పరిషత్ సమావేశపు హాలులో బదిలీల ప్రక్రియ ప్రారంభించారు. దీంతో గ్రేడ్-5 కార్యదర్శులు 88 మంది, గ్రేడ్-6 కార్యదర్శులు 304 మంది తరలొచ్చారు. డిపిఒ కె.అనురాధ ఆధ్వర్యంలో పంచాయతీ అధికారులు ఉద్యోగుల నుంచి ఆప్షన్ ఫారాలు తీసుకున్నారు. ఉద్యోగులకు ఒక ఫారం ఇచ్చి అందులో ఉద్యోగి వివరాలతోపాటు, మూడు స్థానాలకు సంబంధించి ఆప్షన్లు రాయించి తీసుకున్నారు. 28వ తేదీ శనివారం ఇంజినీరింగ్, సర్వేయర్ ఉద్యోగులను, 29న ఆదివారం వెల్ఫేర్ ఉద్యోగులను సైతం ఏలూరు రావాలని పిలిచినట్లు తెలుస్తోంది. మహిళా పోలీసులు, అగ్రికల్చర్, ఫిషరీస్ అసిస్టెంట్లకు సంబంధించి ఇంకా పిలుపు రాలేదని తెలిసింది. శుక్రవారం రాత్రి, లేదా శనివారం వారికి పిలుపు రావొచ్చని తెలుస్తోంది. మరోపక్క డిఎస్‌సి పరీక్షలు జరుగుతున్నాయి. వచ్చే నెల రెండో తేదీ వరకూ పరీక్షలు జరుగుతున్నాయి. ఎంతోమంది సచివాలయ ఉద్యోగులు ఈ పరీక్ష రాస్తున్నారు. ఈ పరిస్థితుల్లో బదిలీల పిలుపు రావడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగులు ఇస్తున్న ఆప్షనల్ ఫారాల ఆధారంగా బదిలీలు జరుగుతాయా.. లేక రాజకీయ నాయకులు చెప్పినట్లు జరుగుతాయా అని ఉద్యోగుల్లో పెద్దఎత్తున చర్చ సాగుతోంది.



ఆప్షన్లు ఇచ్చేందుకు ఏలూరు జిల్లాపరిషత్ సమావేశం హాలుకు వచ్చిన గ్రేడ్-5,6 కార్యదర్శులు

ఇప్పటికే బదిలీల జాబితా సిద్ధం..?

సచివాలయ ఉద్యోగుల బదిలీల ఉత్తర్వులు వెలువడనంతనే గతంలో ఎన్నడూ లేనివిధంగా గందరగోళం నెలకొంది. గ్రామంలోని అధికార పార్టీ నాయకునితో అనుమతిపత్రం తెచ్చుకుంటే.. ఎంఎల్‌ఎ లేఖ ఇస్తారని, అందుకు అనుగుణంగా బదిలీలు ఉంటాయని నాయకులు తెలిపారు. దీంతో సచివాలయ ఉద్యోగులంతా అధికార పార్టీ నాయకులు, ఎంఎల్‌ఎ కార్యాలయాలకు క్యూ కట్టిన పరిస్థితి నెలకొంది. గ్రామాల్లోని రాజకీయ నాయకుల అనుమతి పత్రాలు తీసుకుని ఎంఎల్‌ఎ కార్యాలయాలకు సమర్పించారు. ఎంఎల్‌ఎల నుంచి సంబంధిత లేఖలు ఆయా శాఖల ఉన్నతాధికారుల కార్యాలయాలకు చేరినట్లు తెలుస్తోంది. ఇప్పటికే రాజకీయ నాయకుల లేఖల ఆధారంగా బదిలీల జాబితా తయారైపోయిందని, అధికారులు చేస్తున్న ఆప్షనల్ ప్రక్రియ హడావుడంతా వట్టి బూటకమనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్నిచోట్ల సచివాలయాల ఉద్యోగుల నుంచి రాజకీయ నాయకులు సొమ్ము కూడా వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియను అత్యంత దారుణంగా మార్చారనే చర్చ ఉద్యోగుల్లో నెలకొంది. వికలాంగులు, స్పౌజ్ కేటగిరీలకు సంబంధించిన నిబంధనలు పరిగణనలోకి తీసుకుంటారా.. ఏకపక్షంగా రాజకీయ నాయకులు చెప్పినట్లు బదిలీలు చేసేస్తారా అనేది తేలాల్సి ఉంది. రేషనలైజేషన్ చేయకుండా బదిలీల ప్రక్రియ జరుగుతుండటంతో తీవ్ర గందరగోళం నెలకొంది. కూటమి ప్రభుత్వం బదిలీల వ్యవహారంలో ఏమాత్రం పారదర్శకత పాటించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం



సమీక్షిస్తున్న కలెక్టర్ నాగరాణి, పక్కన జెసి

భీమవరం పట్టణంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు సత్వరమే పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి భవ్య భీమవరం, పాతబస్టాండ్ నిర్మాణం, పార్కుల అభివృద్ధి, రోడ్ల ఆక్రమణల తొలగింపు వంటి అంశాలపై జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవ్య భీమవరం ప్రాజెక్టులో భాగంగా పట్టణంలో దాతల సహకారంతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, ఇంకా ప్రారంభం కాని పనులు ప్రారంభించేందుకు దాతలతో సంప్రదించాలని, దీనిపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. నూతనంగా నిర్మిస్తున్న పాత బస్టాండ్ పనులు, పార్కుల్లో మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో వ్యాపార సంస్థలు, పాఠశాలలు, కళాశాలల వద్ద సీసీ కెమెరాలు ఆయా యాజమాన్యాల ద్వారా ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సూర్యఘర్ పథకంలో భాగంగా సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి పార్థసారధి, అసిస్టెంట్ కమిషనర్, హెల్త్ ఆఫీసర్, మున్సిపల్ ఇంజినీర్లు, డిఇలు పాల్గొన్నారు.

1100కు అందిన అర్జీలు పరిష్కరించాలి

జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన 1100 కాల్ సెంటర్‌కు అందిన అర్జీల పరిష్కారంపై తక్షణ చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక కలెక్టరేట్లో శుక్రవారం 1100 కాల్ సెంటర్‌కు అందిన అర్జీల పరిష్కారంపై రెవెన్యూ, పంచాయతీ, సర్వే, మున్సిపల్, వైద్యశాఖ, ఎలక్ట్రిసిటీ, కోఆపరేటివ్, గృహనిర్మాణం, సివిల్ సప్లయిస్, ఇరిగేషన్, స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్, దేవాదాయ శాఖల జిల్లా అధికారులతో సమీక్షించారు. 1100 గ్రీవెన్స్ పిటీషన్లు నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులను సరైన జవాబుదారీతనంతో పరిష్కరించాలన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో కొన్ని శాఖల అధికారుల నిర్లక్ష్య వైఖరి స్పష్టంగా కనిపిస్తోందని, అటువంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ కెసిహెచ్.అప్పారావు, డిపిఒ రామ్‌నాథ్‌రెడ్డి, డిఎంహెచ్‌ఒ గీతాభాయి, డిఎస్‌ఒ ఎన్.సరోజ, జిల్లా సర్వే ఇన్‌ఛార్జి అధికారి కె.శ్రీనివాసరావు, జిల్లా గృహనిర్మాణ శాఖాధికారి జి.పిచ్చయ్య, జిల్లా సహకార శాఖాధికారి మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

రేపు చించినాడలో అమరవీరుల 75వ వర్ధంతి సభ

పాల్గొననున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర, జిల్లా నేతలు

ప్రజాశక్తి - యలమంచిలి

ఈ నెల 29న చించినాడ అమరవీరుల స్మారక స్తూపం వద్ద అమరవీరుల 75వ వర్ధంతి సభను నిర్వహించనున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేద వర్గాల నిజాం 1941-51 మధ్యకాలంలో భూస్వామ్య గుండాలు, పోలీసు తూటాలకు బలైన మండలంలోని చించినాడ గ్రామానికి చెందిన అమరులైన ఆర్.గోపాలరాజు, అయ్యపురాజు, బూసి వెంకట్రావు, బూసి మునలయ్య, అల్లూరి రామరాజు, 1977-80 మధ్యకాలంలో వీరవల్లి నారాయణ, యాండ్ర సత్యనారాయణ, పంతగాని సూరన్న, కలగంపూడి గ్రామానికి చెందిన గుబ్బల రామలింగయ్య, కాజ గ్రామానికి చెందిన అనిశెట్టి కాశిదాసు, గుబ్బల సాంబమూర్తి, అనంతరం కాలంలో అమరులైన వారిని స్మరించుకుంటూ నిర్వహించే ఈ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, సీనియర్ నేత జుత్తిగ నరసింహమూర్తి, ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ, సిపిఎం నాయకులు బాతిరెడ్డి జార్జి తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని పేర్కొన్నారు. సభలో సిపిఎం సీనియర్ నేత రచించిన 'చించినాడ సమరశీల పోరాట చరిత్ర' అనే పుస్తకాన్ని నాయకుల చేతుల మీదుగా ఆవిష్కరిస్తారని తెలిపారు. ఈ సభలో కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులు, శ్రేయోభిలాషులు, ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

9న దేశవ్యాప్త సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు

జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

జులై 9న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెకు సిపిఎం జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ ప్రకటించారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో జిల్లాస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు అధ్యక్షతన జరిగింది. గోపాలన్ మాట్లాడుతూ లేబర్ కోడ్‌ల రద్దు, కార్మిక సమస్యల పరిష్కారం కోసం జులై 9న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేశంలో ఉన్న బడా పెట్టుబడిదారుల అనుకూల విధానాలను అమలు చేస్తుందన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు తెచ్చారని గుర్తు చేశారు. చెమటోడ్చి దేశ ఆదాయంలో, అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

అక్రమంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. విశాఖ స్టీల్, ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. అధిక ధరలను నియంత్రించాలని, భవన నిర్మాణ, స్కీమ్ వర్కర్లకు, అసంఘటిత రంగ కార్మికులందరికీ ఇఎస్‌ఐ అమలు చేయాలని, వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. గిగ్ వర్కర్లు, ప్రయివేటు విద్యాసంస్థలు, హాస్పిటల్స్, మాల్స్, షోరూమ్స్‌లో పని చేసే వారికి కార్మిక చట్టాలు, కనీస వేతనాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలన్నారు. పలు డిమాండ్ల సాధనకు కార్మిక సంఘాలు చేపట్టే సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గొర్ల రామకృష్ణ, దూసి కళ్యాణి, ధనికొండ శ్రీనివాస్, సూర్నీడి వెంకటేశ్వరరావు, మామిడిశెట్టి రామాంజనేయులు, కానేటి బాలరాజు, సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, కె.రాజారామ్మోహన్‌రాయ్, నాయకులు బాతిరెడ్డి జార్జి, ఆకుల హరేరామ్, పిల్లి ప్రసాద్, ఎం.వైకుంఠరావు, జవ్వాది శ్రీనివాస్, కరెడ్ల రామకృష్ణ, యడ్ల చిట్టిబాబు పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్

ఎస్ఎస్ఎ పిఒ శ్యాంసుందర్

ప్రజాశక్తి - పాలకోడేరు



విద్యార్థులతో మాట్లాడుతున్న శ్యాంసుందర్

విద్యతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు సాధ్యమవుతుందని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అధికారి పి.శ్యాంసుందర్ అన్నారు. వేండ్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు అందజేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జివిబి.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో అసమానతలను విద్య ద్వారా మాత్రమే తొలగించవచ్చన్నారు. విద్యార్థుల లక్ష్యం ఉన్నతంగా ఉండాలన్నారు. ఈ పాఠశాల నుండి ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడంపై ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరానికి పదో తరగతిలో నూరుశాతం ఫలితాలు సాధిస్తామని ట్రిపుల్ ఐటీ సీట్లు ఐదు సాధిస్తామన్నారు. ఎస్ఎస్ఎ పిఒ శ్యామ్ సుందర్ పాఠశాల సైన్స్ లేబరేటరీ నిమిత్తం రూ.రెండు లక్షలు మంజూరు చేసినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో సిఎంఒ చంద్రశేఖర్, ఎఎంఒ సుబ్రహ్మణ్యం, ఎంఇఒ శివన్నారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు జె.శ్రీనివాసరావు, పంపన సాయిబాబు, ఎం.వెంకటరమణ, వివిఎస్.శ్రీధర్, వి.పార్వతి, పి.ఫణిరాజేష్, విశ్వనాథరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మె

సంఘీభావం తెలిపిన మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ, సిపిఎం జిల్లా నేత కవురు పెద్దిరాజు



మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ వెంకటరమణ

ప్రజాశక్తి - నరసాపురం

మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను, కార్మికులను పర్మినెంట్ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఐదు రోజులుగా దీక్షలు చేస్తున్న కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. అవుట్ సోర్సింగ్ కార్మికుల్లో టెక్నికల్ సిబ్బందికి రు.29,200, నాన్ టెక్నికల్ సిబ్బందికి రూ.24,500 వేతనం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. తగిన విద్యార్హతలు కలిగి ఉండి 20 సంవత్సరాల నుండి పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయకపోవడం దారుణమని అన్నారు. ఒకవైపు పెరిగిన ధరలు, మరోవైపు చాలీచాలని వేతనాలతో కార్మికులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులు, ఉద్యోగులు సాగించే పోరాటాలకు సిపిఎం మద్దతు ఉంటుందని పెద్దిరాజు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు బూడిద జోగేశ్వరరావు, నోముల కొండ తదితరులు పాల్గొన్నారు.

తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం చేపట్టిన సమ్మెకు మున్సిపల్ కౌన్సిల్ సంఘీభావం తెలిపింది. మున్సిపల్ కార్మికుల దీక్షా శిబిరాన్ని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ, కౌన్సిలర్లు సందర్శించి మద్దతు తెలిపారు. ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రత్నం, సత్యనారాయణ, కిషోర్, బత్తుల శ్రీను, సుజాత, కాశీ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని మహిళలు అందిపుచ్చుకోవాలి : ఎంఎల్‌ఎ

తణుకు : నేటి సమాజంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని మహిళలు అందిపుచ్చుకోవాలని తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక కూటమి కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు సంబంధించి రూ.14.70 లక్షల విలువైన 49 ట్యాబులను ఆర్‌పిలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ రాధాకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషితోనే పరిపాలన, సాంకేతిక అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. ప్రతీ రంగంలో సాంకేతికతను అభివృద్ధి చేశారన్నారు. 1500 డ్వాక్రా గ్రూపులకు సంబంధించి ఎస్‌ఎల్‌ఎఫ్, ఆర్‌పిలకు సంబంధించి మరింత వేగంగా పని చేసేందుకు వీలుగా ట్యాబులను ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బ్యాంకు లింకేజీ ద్వారా తణుకు పట్టణంలో 9.95 శాతం వడ్డీతో 58 గ్రూపులకు రూ.45 కోట్లు పైగా రుణాలు అందించినట్లు తెలిపారు. ట్యాబుల ద్వారా వారి కార్యకలాపాలను అనుసంధానం చేసే విధంగా డ్వాక్రా మహిళలకు సేవలు మరింత సరళతరం చేసేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. మహిళలకు ఆర్థిక స్వాలంభన సాధించేందుకు వీలుగా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి సిబ్బంది డబ్బులడిగితే ఫిర్యాదు చేయండి

ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆర్.సుప్రియ

నరసాపురం : నరసాపురం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది ఎవరైనా రోగి, రోగి బంధువులు నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని ఆసుపత్రి సూపరిటెండెంట్ ఆర్.సుప్రియ అన్నారు. శుక్రవారం ఆసుపత్రిలో ఆమె ఛాంబర్‌లో పత్రికా సమావేశం నిర్వహించారు. పోస్టుమార్టం సమయంలో మృతుల కుటుంబం నుంచి రూ.3 వేలు లంచం తీసుకున్న ఇద్దరు సిబ్బందిని కలెక్టర్ సస్పెండ్ చేసినట్టు తెలిపారు. ఇటు ప్రభుత్వం, వైద్యశాఖ కూడా ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుందన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఉపాధి కార్మికుల కుటుంబాల నుంచి డిమాండ్ చేసి డబ్బులు వసూలు చేయాడాన్ని మృతుల బంధువులు ఫిర్యాదు చేయడంతో జిల్లా వైద్యాధికారులు సీరియస్‌గా పరిగణించి విచారణ చేపట్టి సస్పెండ్ చేసారన్నారు. మళ్లీ ఇటువంటి సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఎవరైనా లంచం అడిగినా, సరిగ్గా స్పందించకపోయినా తక్షణం ఫిర్యాదు చేయాలని కోరారు. కొంత మంది సిబ్బంది ఎంతో అంకితభావంతో పని చేస్తూ రోగులకు సేవలందిస్తున్నారన్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో పోస్టుమార్టం చేసేందుకు సిబ్బంది లేరన్నారు. తాత్కాలికంగా పాలకొల్లు నుంచి సిబ్బందిని రప్పించి చేయిస్తున్నామన్నారు.

నిడమర్రు సిఐగా రజనీకుమార్

గణపవరం : నిడమర్రు సిఐగా నక్కా రజనీకుమార్ శుక్రవారం సాయంత్రం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో సిఐగా ఉన్న ఎంవి.సుబాష్ జంగారెడ్డిగూడెం బదిలీ అయ్యారు. బాధ్యతలు తీసుకున్న రజనీకుమార్ తన సర్కిల్ పరిధిలోని నిడమర్రు, గణపవరం, ఉంగుటూరు మండలాల్లో శాంతిభద్రతలపై ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని విలేకరులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో గణపవరం, నిడమర్రు, చేబ్రోలు ఎస్ఐలు మణికుమారి, వీరప్రతాఫ్, సూర్య భగవాన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరి మెమోరియల్ హాలు పునర్నిర్మించాలి

లేని పక్షంలో ఆందోళన చేసేందుకు సిద్ధం

30న రౌండ్ టేబుల్ సమావేశం, వచ్చేనెల నాలుగో తేదీన నిరసన దీక్ష

అల్లూరి మెమోరియల్ హాల్ నిర్మాణ సాధన కమిటీ స్పష్టం

భీమవరం : భీమవరం పాత బస్టాండ్ వద్ద అల్లూరి సీతారామరాజు మెమోరియల్ హాలు పునర్నిర్మాణం చేయాలని అల్లూరి సీతారామరాజు మెమోరియల్ హాలు నిర్మాణ సాధన కమిటీ డిమాండ్ చేసింది. స్థానిక వెంటేవారి తోటలోని అల్లూరి సీతారామరాజు మెమోరియల్ సాధన కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాధన కమిటీ సభ్యులు బి.వాసుదేవరావు మాట్లాడారు. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన అల్లూరి సీతారామరాజు పట్ల పాలకవర్గాలు చిన్నచూపు చూడటం దారుణమన్నారు. స్వాతంత్ర పోరాటానికి స్ఫూర్తినిచ్చిన అల్లూరి సీతారామరాజు మెమోరియల్ హాలు నిర్మాణం ఇంతవరకు నిర్మాణం చేపట్టకపోవడం బాధాకరమని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే అల్లూరి సీతారామరాజు మెమోరియల్ హాల్ నిర్మాణం చేపట్టాలని, జూలై 4న అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా నిరసన దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. ఈనెల 30న అల్లూరి సీతారామరాజు మెమోరియల్ హాలు నిర్మాణం కోరుతూ యుటిఎఫ్ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి స్వచ్ఛంద సంస్థలు, మేధావులు, అల్లూరి సీతారామరాజు సేవా సమితి సభ్యులు, దళిత సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సభ్యులు ఎం.వైకుంఠం, బి.సత్యనారాయణ, సిహెచ్.వెంకటేశ్వరరావు, డి.త్రిమూర్తులు, డి.నాగేశ్వరరావు, బి.వరలక్ష్మి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సాధన కమిటీ సభ్యులు

బడిఈడు పిల్లలు పాఠశాలలో చేరండి : హెచ్‌ఎం

ప్రజాశక్తి - ఉండి

బడి ఈడు పిల్లలందరూ పాఠశాలలో చేరాలని వాండ్రం మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎన్.కాళిదాసు పిలుపునిచ్చారు. శుక్రవారం ఉండి మండలం వాండ్రం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఎన్రోల్మెంట్ డ్రైవ్‌లో భాగంగా గ్రామంలో ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదు సంవత్సరాలు నిండిన విద్యార్థులను పాఠశాలలో చేర్పించే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రతి బడి ఈడు పిల్లలున్న వారి తల్లిదండ్రుల దగ్గరకు వెళ్లి పాఠశాల వసతులు గూర్చి, ప్రభుత్వం సమకూరుస్తున్న సదుపాయాల గురించి, పాఠశాల విద్యా విషయాలను తల్లిదండ్రులకు వివరించారు. పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి పుట్టినరోజును గత సంవత్సరం నుంచి ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, ఈవిధంగా చేయడంతో విద్యార్థులకు పాఠశాల పైన ఆసక్తి కలుగుతుందన్నారు. గ్రామంలో ప్రతి ఇంటిని ఉపాధ్యాయ బృందం సందర్శించి ఆటోలో మైక్ అనౌన్స్‌మెంట్, పాంప్లెట్ రూపంలో ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. ఈ విధంగా చేయడంతో గ్రామంలో విద్యార్థుల తల్లితండ్రులు వాళ్ల పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్చుటకు ఆసక్తి చూపిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి కలిగిస్తున్న ఉపాధ్యాయ బృందానికి గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.సత్యనారాయణ ఉన్నారు.

పెదతాడేపల్లి గురుకుల విద్యార్థులకు ఆలిండియా ర్యాంకులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కె.సుభాష్

జి.మహేష్

పిజె.సందీప్

డి.రాజేష్

ఇటీవల జరిగిన శ్రేష్ట ప్రవేశ పరీక్షలో పెద్ద తాడేపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి ర్యాంకులు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ బి.రాజారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ నెలలో జరిగిన శ్రేష్ట పరీక్షకు 140 మంది విద్యార్థులు హాజరు కాగా 140 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. 9వ తరగతి విద్యార్థులు జి.మహేష్ 903, కె.సుభాష్ 1012 ర్యాంకులతో పాటు స్కూల్ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారన్నారు. ఇంటర్ పరీక్షలో పి.జాయ్ సందీప్ 1112, డి.రాజేష్ 1160 ర్యాంకులు సాధించినట్లు ఆయన తెలిపారు. తమ గురుకులానికి చెందిన 30 మంది విద్యార్థులకు దేశంలో పేరుగాంచిన ప్రయివేటు పాఠశాలలో విద్యను అభ్యసించే అవకాశం కల్పిస్తారన్నారు. వీరికి చదువు, హాస్టల్ వసతి ఉచితంగా అందిస్తారని ఆయన తెలిపారు. పెదతాడేపల్లి గురుకుల పాఠశాల నుంచి 2022లో 32 మంది, 2023లో 50 మంది, 2024 30 మంది విద్యార్థులు దేశంలోని వివిధ కార్పొరేట్ పాఠశాలలో చదువుతున్నట్లు ప్రిన్సిపల్ రాజారావు తెలిపారు.

కలెక్టర్ నిర్ణయం పట్ల వ్యకాస హర్షం

భీమవరం : ఉపాధి కూలీల పోస్టుమార్టంకి డబ్బులు వసూలు చేసిన వారిని సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ ప్రకటన విడుదల చేయడాన్ని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఈమేరకు ఆ సంఘం నుంచి శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ 16న మొగల్తూరులో ఉపాధి పని చేస్తున్న కూలీలపై వ్యాన్ దూసుకు వెళ్లి చనిపోయిన బాధలో ఉన్న కుటుంబాల నుంచి ఒక్కొక్కరు పోస్టుమార్టం నిమిత్తం రూ.3 వేలు వసూలు చేయటం దుర్మార్గమైన చర్యని సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ అన్నారు. నాడు జరిగిన ప్రమాదంలో ఒకే కుటుంబంలో భార్యాభర్త, మరో కుటుంబంలో పావని చనిపోయారని, మరొక వ్యక్తి తీవ్రంగా గాయపడి చికిత్స పొంది కోలుకున్నాడని అన్నారు. నాడు జరిగిన సంఘటనను ప్రత్యేక ప్రమాదంగా గుర్తించి ఎక్స్‌గ్రేషియా వారి కుటుంబాలకు అందించాలని కోరినప్పటికీ ప్రభుత్వం నేటికీ స్పందించలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అదనంగా ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు.

ఐఐటీ ర్యాంకర్ యశ్వంత్‌కు అభినందన

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధిస్తూ బొంబాయి ఐఐటీలో సిఎస్ఇ సీటు సాధించిన పాలకొల్లు విద్యార్థి కోటిపల్లి యశ్వంత్‌ను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అభినందించారు. యశ్వంత్ తండ్రితో పాటు మంత్రి నిమ్మల పాలకొల్లు కార్యాలయంకు శుక్రవారం వచ్చారు. సాధారణ కౌలు రైతు కుటుంబంలో పుట్టిన యశ్వంత్ ఏ టెస్ట్ రాసినా ర్యాంకర్ అవ్వడం కృషి పట్టుదలకు నిదర్శనం అన్నారు. పాలిసెట్ లో రాష్ట్ర ఫస్ట్ ర్యాంక్, జెఇఇ మెయిన్స్‌లో ఇడబ్ల్యుఎస్‌లో జాతీయ ఫస్ట్ ర్యాంక్ సాధించాడని చెప్పారు. జెఇఇ అడ్వాన్స్‌లో జాతీయ 113 ర్యాంక్, ఎం సెట్‌లో స్టేట్ థర్డ్ ర్యాంక్ సాధించాడని చెప్పారు. ప్రస్తుతం బాంబే ఐఐటీలో సిఎస్‌సిలో చేరాడని అభినందించారు. విద్య వలనే సాధారణ కుటుంబాలు అసాధారణంగా ఎదుగుతున్నారని చెప్పారు.

75 మందికి రక్త పరీక్షలు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం మూడవ సచివాలయం పరిధిలోగల మసీదు వీధి వడ్డిగూడెం షెడ్యూల్ తెగలకు చెందిన 75 మందికి శుక్రవారం సికిల్ సెల్ అనీమియా రక్త పరీక్షలు చేసినట్లు గణపవరం పిహెచ్‌సి వైద్యులు కె.ఓంకార్‌నాథ్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వైద్యాధికారి గీతాబాయి ఆదేశాల మేరకు 75 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. సికిల్ సెల్ అనీమియా వ్యాధి గిరిజన ప్రాంత వాసులకు వస్తుందని చెప్పారు. ఆరు నెలల నుంచి 16 ఏళ్ల వయస్సు గల వారికి ఈ వ్యాధి వస్తుందన్నారు. వ్యాధి వచ్చిన వారికి ఎర్ర రక్తకణాలు అర్ధ చంద్రాకారంలో మారుతుందని తెలిపారు. వ్యాధి వల్ల వచ్చే అనర్థాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్‌బాబు, ఎఎన్ఎం ప్రేమలీల, హెల్త్ అసిస్టెంట్ ఎ.కృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అతిసారపై జాగ్రత్తలు తీసుకోవాలి

పిఎంపి అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పరమేశ్వర్లు

ప్రజాశక్తి - గణపవరం

అతిసార వ్యాధిపై ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని పిఎంపి అసోషియేషన్ జిల్లా అధ్యక్షులు ఎఆర్‌కె.పరమేశ్వర్లు అన్నారు. శుక్రవారం కాశిపాడు ఆరోగ్య సిబ్బంది పిఎంపి అసోషియేషన్ ఆధ్వర్యంలో అతిసార నివారణపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పరమేశ్వర్లు మాట్లాడుతూ కాచి చల్లార్చిన నీరు తాగాలని చెప్పారు. అయిదేళ్లలోపు పిల్లలు కలిగిన తల్లులు ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను, జింక్ మాత్రలను వాడి అతిసార వ్యాధి బారిన పడకుండా తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ ఎ.రమ్యశ్రీ, ఎఎన్ఎం వి.శివకుమారి, ఆశాలు టి.వరలక్ష్మి, సిహెచ్.కృష్ణవేణి, అంగన్వాడీ వర్కర్లు, స్థానికులు ఎస్.సత్యనారాయణ, యు.నాగేశ్వరరావు, వంగపండు దుర్గ, కె.సాయి పాల్గొన్నారు.

ఫ్రై డే డ్రై డే పాటించాలి

జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వీర్ల క్రాంతి కుమార్

ప్రజాశక్తి - కాళ్ల

దోమల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి శుక్రవారం ఫ్రై డే డ్రై డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వీర్ల క్రాంతికుమార్ తెలిపారు. శుక్రవారం కాళ్ల గ్రామంలో పలు ప్రాంతాల్లో డ్రై డే కార్యక్రమం నిర్వహించి నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమల లార్వాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది వర్షాకాలం కనుక పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని నీరు నిలవ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమలు వృద్ధి చెందడం వల్ల మలేరియా, ఫైలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలి ప్రాణాంతకం కావచ్చని వివరించారు. కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సిహెచ్.రంగం నాయుడు మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా లార్వా దశలోనే పరిసరాలలో స్ప్రేయింగ్ చేయించి దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సరాబు సునీల్, ఎంఎల్‌హెచ్‌పి. స్నేహ, ఎఎన్ఎం రాజకుమారి, హెల్త్ అసిస్టెంట్ రవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మేధో సంపత్తి హక్కులపై ఆన్‌లైన్ వర్క్‌షాప్

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక శ్రీఅద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాలలో శుక్రవారం మేధో సంపత్తి హక్కులపై ఆన్‌లైన్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ తిరువీధుల రాజరాజేశ్వరి ప్రారంభ ఉపన్యాసంలో మేధో సంపత్తి హక్కులపై ఏర్పాటు చేసిన ఈ వర్క్ షాప్‌లో పాల్గొన్న ఫ్యాకల్టీ, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులకు సంపూర్ణ అవగాహన ఇస్తుందని తెలిపారు. మానవ జీవితం మెరుగుపరచడంలో మేధో సంపత్తి హక్కులు చట్టం ప్రాముఖ్యత ఎంతో ఉందని, ఆవిష్కరణలు ప్రతి ఒక్కరూ మేధో హక్కుల చట్టం గురించి తెలుసుకోవాలని చెప్పారు. ఈ వర్క్ షాప్‌కు రిసోర్స్ పర్సన్‌గా రాజీవ్ కుమార్ రామ, అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ పేటెంట్స్ అండ్ డిజైన్స్, రాజీవ్ గాంధీ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ మేనేజ్‌మెంట్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, నాగ్‌పూర్ వారు విచ్చేసి మేధో సంపత్తి హక్కులలో పరిశోధనలు చేసే వారికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని, పూర్తి స్థాయి హక్కులు పొందిన తర్వాతే వాటిని ప్రకటించాలని, అప్పుడు ప్రచురణలు, ప్రయోగాలకు పూర్తిస్థాయిలో విలువ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.కృష్ణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కె.భద్రాచలం, ఐపిఆర్ కన్వీనర్ డాక్టర్ ఎ.రామకృష్ణ, మెంబర్ డాక్టర్ వి.విజయలక్ష్మి, ఎ.వంశీ సుబ్బారావు పాల్గొన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర విప్, ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రజాధనాన్ని దోచుకుని దుర్వినియోగం చేసిన నాయకులు చరిత్రలో కొట్టుకుపోయారని రాష్ట్ర విప్, ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పెంటపాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా అనుగుణంగా నూతన అభివృద్ధి పనులకు రూపకల్పన చేస్తున్నామన్నారు. గ్రామాలు, పట్టణాల సమగ్రాభివృద్ధే ప్రణాళికాబద్ధంగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ నిధులను కేటాయిస్తున్నామని అన్నారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. గత వైసిపి హయాంలో రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని, అటువంటి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని సహకారంతో ముందుకు వెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ప్రభాకర్ రావు, మండల తహశీల్దార్ టి.రాజరాజేశ్వరి, ఎంపిడిఒ బాలాజీ వెంకటరమణ పాల్గొన్నారు.

రహదారి పక్కన చెట్ల తొలగింపు

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు లాకులపల్లపాలెం వద్ద రహదారిపై ప్రయాణికులకు, ప్రజలకు అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మలను పంచాయతీ, గ్రామస్తులు శుక్రవారం యంత్రాలతో తొలగించారు. మొగల్తూరు మీదుగా ముత్యాలపల్లి వైపు వెళ్లే ఆర్‌టిసి బస్సులు గ్రామంలోని 216 జాతీయ రహదారి విస్తరణ పనుల కారణంగా లాకులపల్లపాలెం మీదుగా వెళ్లే బస్సులను కుక్కులవారితోట మీదుగా మూడు సంవత్సరాల నుంచి మళ్లించారు. రహదారి పనులు పూర్తికావడంతో పాటు లాకులపల్లపాలెం వద్ద హైవే రోడ్డుకు అప్రోచ్ రోడ్డు నిర్మించడంతో పూర్వ స్థితిలో ఆర్‌టిసి బస్సులు లాకులపల్లపాలెం మీదుగా వెళ్లే పరిస్థితి ఏర్పడింది. అయితే అప్రోచింగ్‌లో రహదారికి ఇరువైపులా పెరిగిన చెట్ల కొమ్మలు కారణంగా బస్సు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆర్‌టిసి అధికారులు సూచించడంతో శుక్రవారం చెట్ల కొమ్మలను స్థానిక పంచాయతీ సిబ్బంది సహకారంతో గ్రామస్తులు కడలి నాని, వైసిపి నాయకులు పటాల కృష్ణమూర్తి, కొప్పాడ నాగమల్లేశ్వరరావు, కొల్లాటి సత్యనారాయణ తొలగించారు. సుమారు నాలుగు సంవత్సరాల తరువాత లాకు పల్లపాలెం మీదుగా ఆర్‌టిసి బస్సులు తిరిగిరావడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రమాదవశాత్తూ జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నరసాపురం

సరదాగా కుటుంబ సభ్యులతో గడపాలన్న ఆశతో స్వగ్రామానికి వచ్చిన ఓ ఉద్యోగి ప్రమాదవశాత్తు భవనం పైనుండి పడి మృతిచెందాడు. మండలంలోని రుస్తుంబాద కొత్తకాలనీ గట్టున ఈ విషాద సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపల్లి యజ్ఞపతిరాజు(29) గుజరాత్‌లో ఎలక్ట్రికల్ నేవీ అధికారిగా పని చేస్తున్నాడు. మూడు నెలల క్రితం వివాహం జరిగింది. ఈనెల 25న శెలవుపై స్వగ్రామం రుస్తుంబాద వచ్చాడు. ఇంటిపై చెత్తా, చెదారం పేరుకుపోవడంతో దాన్ని శుభ్రం చేసేందుకు భవనంపైకి ఎక్కాడు. అదే సమయంలో ప్రమాదవశాత్తు జారి భవనం నుండి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే యజ్ఞపతిరాజు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీనిపై మృతుని తండ్రి కొత్తపల్లి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ కె.శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఘనంగా బకించంద్ర ఛటర్జీ జయంతి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఆధునిక భారతీయ సాహిత్య చరిత్రలో అగ్రగణ్యులు బకించంద్ర ఛటర్జీ అని పిఎస్ఎం బాలికోన్నత మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బి.ప్రసాద్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం వందేమాతరం గేయ రచయిత, దేశభక్తులు బంకించంద్ర ఛటర్జీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మహాకవి రచించిన దేశభక్తి గీతం ప్రజలను ఉత్తేజపరిచి, ఉద్యమింపచేసిన సంఘటన భారతదేశ స్వాతంత్రోద్యమంలో తప్ప మరో చోట ఎక్కడా సంభవించలేదని, వందేమాతరం గీతం వేగాన్ని మరింత పెంచిందన్నారు. అరసవల్లి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు అరసవల్లి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆనాటి స్వాతంత్ర ఉద్యమంలో వందేమాతరం నినాదం ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిందని, వందేమాతరం గీతం ప్రజల్లో ఉత్తేజాన్ని కలిగిస్తుందని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ భక్తిని ప్రేరేపించే వందేమాతరం గీతం రచించిన ఛటర్జీ చరిత్ర యుగాంతం వరకు నిలిచి ఉంటుందని, దేశభక్తి, జాతీయ సమైక్యత మేళవించి ఒక జాతీయ స్ఫూర్తినిచ్చాయని, వందేమాతరం గీతం భారతదేశ ఔన్నత్యానికే ప్రతీక అని అన్నారు. అనంతరం దేశభక్తి ప్రతిజ్ఞ నిర్వహించి ముక్త కంఠంతో వందేమాతరం, మా తెలుగు తల్లికి మల్లె పూదండ గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షర్మిల, సునీల్, ఫణికుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజన ప్లేట్ల బహూకరణ

పాలకొల్లురూరల్: పాలకొల్లు రూరల్ గాంధీనగర్(పందిగుంట) మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు మధ్యాహ్న భోజన పళ్లాలను కెసిరాజు కృష్ణ(గజల్స్ కృష్ణ) వరసిద్ధి వినాయక స్వామి వారి పేరుమీద విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేష్ బాబు, నాయకులు దొడ్డా శ్రీనివాసరావు, పాముల రజనీకుమార్, కెవిఆర్‌కె.మోహన్, కుర్మా గణేష్, పాలపర్తి జాన్సన్, పాఠశాల వైస్ ఛైర్మన్ కె.దుర్గారాణి, అంగన్వాడీ కార్యకర్త బి.అభిరాణి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సత్యనారాయణకు బివి.రావు కళా సేవా పురస్కారం

పాలకొల్లు : గుంటూరుకి చెందిన ప్రముఖ పౌరాణిక రంగస్థలం కళాకారులు బివి.రావు స్మారకార్థం ఏర్పాటు చేసిన బివి.రావు కళాసేవా పురస్కారాన్ని పాలకొల్లు కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి మానాపురం సత్యనారాయణకు అందజేశారు. ప్రముఖ నాటకరచయిత, దర్శకులు, కళారత్న కావూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో బివి.రావు కుమారులు ఈ పురస్కారాన్ని అందజేశారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై ఈ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 4 దశాబ్దాలుగా నాటక రంగానికి సేవలందించిన మానాపురం సత్యనారాయణను అవార్డుకు ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంటూరుకు చెందిన ప్రముఖ రంగస్థలం కళాకారులు చెరుకూరి సాంబశివరావు, వరికూటి శివప్రసాద్, చిలకలూరిపేట ప్రసాద్, టివి.పురుషోత్తం పాల్గొన్నారు. మానాపురం సత్యనారాయణకు బివి.రావు కళాసేవా అవార్డు రావడం పట్ల పాలకొల్లు కళాపరిషత్ అధ్యక్షుడు కెవి.కృష్ణవర్మ, గౌరవాధ్యక్షులు మేడికొండ శ్రీనివాసరావు చౌదరి, కార్యదర్శి జక్కంపూడి కుమార్, ఉపాధ్యక్షులు డాక్టర్ కెఎస్‌పిఎన్.వర్మ, విటాకుల రమణ, కోశాధికారి కొనిజేటి గుప్త, తదితరులు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు సత్కారం

పెనుమంట్ర: గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో టెన్త్‌లో మంచి మార్కుల సాధనకు విద్యార్థుల ప్రతిభతో పాటు ఉపాధ్యాయుల కృషి తోడవుతుందని మండల సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పడాల జగన్నాథ రెడ్డి అన్నారు. శుక్రవారం మార్టేరు బసంతీ దేవి జెడ్‌పి బాలికల హై స్కూల్ నుంచి టెన్త్‌లో అధిక మార్కులు సాధించి విజేతలుగా నిలిచిన ముగ్గురు విద్యార్థులకు ఆరు వేల రూపాయలు చొప్పున 5 వందల కరెన్సీ దండలు వేసి సత్కరించారు. విద్యార్థులు కె.నాగ వెంకటసాయి 564, కె.సాయి స్మృతి 563, డి.పూర్ణ రెడ్డి 554లకు అసోసియేషన్ ప్రతినిధులు జగన్నాథ రెడ్డి, చిర్ల నరసింహా రెడ్డి, చింతా కనికి రెడ్డి, కొత్త సత్యనారాయణ మూర్తి, స్కూల్ హెచ్ఎం.లక్ష్మీ గణేష్ సన్మానించారు.

మెగా డిఎస్‌సికి 608 మంది హాజరు

భీమవరం : జిల్లావ్యాప్తంగా మూడు పరీక్ష కేంద్రాల్లో శుక్రవారం మెగా డిఎస్‌సి పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం సెషన్‌లో 360 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 303 మంది హాజరయ్యారు. 57 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 360 మందికి గాను 305 మంది హాజరయ్యారు. 55 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 720 మందికి గాను 608 మంది హాజరయ్యారు. 112 మంది గైర్హాజరయ్యారు. 84.44 శాతం హాజరు నమోదైంది. ఏవిధమైన మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ తెలిపారు.

9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

నరసాపురం: కార్మికుల సమస్యలపై జూలై 9న దేశవ్యాప్తంగా చేపడుతున్న సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని తూర్పుతాళ్ళ గ్రామంలో అంగన్వాడీ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పనిగంటలు పెంచడం ఆపాలని తదితర డిమాండ్లపై సమావేశంలో చర్చించారు. సమ్మె రోజున ఆయాలు, టీచర్లు అంగన్వాడీ సెంటర్లను మూసి సమ్మెలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో వి.వెంకటలక్ష్మి, ఎం. బోగేశ్వరి, జికె.ముత్యాలమ్మ, జి.రామలక్ష్మి, టి.రాజేశ్వరి, సోని పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు అన్నారు. బ్రహ్మానంద రెడ్డి మార్కెట్, ఉల్లిపాయలు మార్కెట్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద చల్లా చంద్రరావు అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు మాట్లాడుతూ హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని తెలిపారు. జూలై 9న జాతీయను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అల్లు సుబ్బారావు, బంకరు నాగేశ్వరరావు, కరక వెంకటరావు, సిరప్ గణేష్, సలుమూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

పూడికతీత పనులపై ధ్వజం

నరసాపురం : డ్రెయినేజీల్లో సిల్ట్ తొలగింపు పనులపై శుక్రవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో స్వపక్ష, విపక్ష సభ్యులు అధికారులపై విరుచుకుపడ్డారు. చైర్‌పర్సన్ బర్రె వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైస్ చైర్మన్‌లు కామని నాగిని, కొత్తపల్లి నాని, వైసిపి కౌన్సిలర్లు సఖినేటిపల్లి సురేష్, వన్నెంరెడ్డి శ్రీను, బొంతు రాజశేఖర్, స్వతంత్ర సభ్యులు కోటిపల్లి సురేష్, వైకెఎస్‌లు పూడిక తీత పనులపై ధ్వజమెత్తారు. ఎండకాలంలో చేయాల్సిన పనుల్ని వాన కాలంలో చేయడం వల్ల తీసిన సిల్ట్ తీసినట్లే డ్రెయినేజీల్లోకి జారి పోతుందని, రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయంటూ మండిపడ్డారు. ఈ పనులకు సంబంధించి బిల్లులు చెల్లింపులో సభ్యులు సంతకాలు పెట్టిన తరువాతే గుత్తేదారులకు చెల్లించాలన్నారు. ఇటు అధికారులు కూడా నిబంధనలకు అనుగుణంగా డ్రెయినేజీల్లో సిల్ట్ తీసారా లేదా అన్న విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. పూడికతీత తొలగించేందుకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వ స్కూల్లో ఎలా వసతి కల్పించారంటూ విసి కామన నాగిని నిలదీశారు. దీనిపై కమిషనర్ అంజయ్య సరైన సమాధానం ఇవ్వకపోవడంతో పోడియం వద్ద బైఠాయించారు. మిగిలిన కౌన్సిలర్లు ఇరుపక్షాలకు సద్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

మావుళ్లమ్మ ఆలయంలో అన్న సమారాధన

భీమవరం టౌన్: అన్ని దానాల్లోకెల్లా అన్నదానం ఎంతో గొప్పదని పలువురు వక్తలు అన్నారు. భీమవరం 36వ వార్డు రామరాజు తోటలో మావుళ్లమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీమావుళ్లమ్మ అమ్మవారి(చిన మావుళ్లమ్మ) 40వ జాతర మహోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం అన్న సమారాధన నిర్వహించారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించి మహా నివేదన చేశారు. అమ్మవారి మహా నివేదనకు హారతులు ఇచ్చి అన్న సమారాధనను నిర్వహించారు. వేలాది మంది భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. 5 రోజులపాటు అమ్మవారి జాతర మహోత్సవాలను నిర్వహిస్తున్నామని సేవా సమితి సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు రామాయణం సుదీర్ బాబు, రేవూరి గోగురాజు, రావూరి సుందరావు పాల్గొన్నారు.

రామారావు మృతి మానవత సంస్థకు తీరని లోటు

మానవత మండల శాఖ డైరెక్టర్ కొల్లేపర వెంకన్న బాబు



ఆచంట : కొడమంచిలి గ్రామానికి చెందిన కీర్తిశేషులు కొల్లేపర రామారావు అకాల మృతి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థకు తీరని లోటని మానవత మండల శాఖ డైరెక్టర్ కొల్లేపర వెంకన్న బాబు అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 91 సంవత్సరాల వయసులో కూడా రామారావు సమాజ సేవలో ముందుండేవారని కొనియాడారు. 1983వ సంవత్సరంలో మండలంలో మొట్టమొదటి ఆర్యవైశ్య సంఘం భవన నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషించారన్నారు. పెనుగొండ మండలం చిన్నమల్లం గ్రామంలో రైతు సంఘం అధ్యక్షులుగా 40 సంవత్సరాల పాటు సుదీర్ఘ విశేష సేవలు అందించి అందరి మన్నలు పొందారని కొనియాడారు. మండలంలోని ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులుగా, గౌరవ సలహాదారునుగా సేవలందించారన్నారు. 2005 సంవత్సరంలో తాడేపల్లిగూడెంలో ఏర్పాటుచేసిన సేవా కార్యక్రమంలో ఆయనను ఘనంగా సన్మానించి, సత్కరించి 'సిరిమువ్వ' అవార్డు అందుకుని ప్రశంసలు పొందారు. 1995 సంవత్సరం నుంచి కొడమంచిలి, బీమలాపురం, రావులపాలెం గ్రామాల్లో పదవ తరగతి, ఏడవ తరగతిలో, ప్రథమ, ద్వితీయ శ్రేణిలో విద్యార్థులకు గోల్డ్ మెడల్ సిల్వర్ మెడల్స్ నేటికి అందిస్తూ విద్యార్థులను చదువుపై ఆసక్తి చూపించి, ఉన్నత శిఖరాలు అధిరోహించే విధంగా ప్రోత్సహించే వారని గుర్తుచేశారు. జూన్ 4వ తేదీన 70వ పెళ్లిరోజు వేడుకలు ఘనంగా నిర్వహించామన్నారు. మానవత సేవా సంస్థలో జీవిత కాలం సభ్యునిగా కొనసాగుతూ అనేక సేవా కార్యక్రమంలో ఆర్థిక సహాయం అందిస్తూ సంస్థను ముందుకు తీసుకెళ్లే విధంగా ప్రోత్సహించే వారని కొనియాడారు. ఈనెల 20వ తేదీన కొల్లేపర రామారావు అకాల మృతి చెందారని, దీంతో మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు తీరని లోటు అన్నారు. ఈనెల 29 తేదీ ఆదివారం ధర్మోధికములు, 30వ తేదీన సపండీ కరణం కార్యక్రమాలు కొడమంచిలి గ్రామంలో మా స్వగృహంలో అత్యంత వైభవంగా జరుగుతుందని వెంకన్న బాబు తెలిపారు.

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయాలి

నరసాపురంలో..

ప్రజాశక్తి - నరసాపురం

జూలై 5వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీచేసి కక్షిదారులకు సమన్యాయం అందించుటలో న్యాయవాదులు భాగస్వామ్యం కావాలని నరసాపురం సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) జి.గంగరాజు అన్నారు. శుక్రవారం స్థానిక బార్ అసోసియేషన్ హాల్‌లో న్యాయవాదులతో న్యాయమూర్తి సమావేశం నిర్వహించారు. న్యాయవాదులు కూడా తమ కక్షిదారులకు లోక్‌అదాలత్ ముఖ్య ఉద్దేశ్యంను వివరించాలన్నారు. రోజూ కోర్టులో వర్చువల్‌గా జరుగుతున్న మధ్యవర్తిత్వంను సద్వినియోగం చేసుకొని కక్షిదారులకు సమన్యాయం అందించుటకు న్యాయవాదులు పూర్తి సహకారాన్ని అందించాలని న్యాయవాదులకు సూచించారు. క్రిమినల్ కేసులతో పాటు సివిల్ కేసులు కూడా ఎక్కువగా రాజీ అయ్యేలా తమ వంతు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) ఆర్.వరలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు చేగొండి బాలాజీ, కార్యదర్శి రంపా పుల్లాజి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న సివిల్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాష తెలిపారు. శుక్రవారం బార్ అసోసియేషన్ అధ్యక్షులు సిరిగినీడి విజయకృష్ణ ఆధ్వర్యంలో న్యాయవాదుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ జూలై 5న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో కక్షి దారుల మధ్య ఎక్కువ కాలం పెండింగ్లో ఉన్న కేసులను పరిష్కరించేలా కృషి చేయాలని న్యాయవాదులను ఆయన కోరారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్యకిరణశ్రీ, బార్ అసోసియేషన్ కార్యదర్శి భూపాల్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో..

పొలమూరు విద్యార్థిని రత్నశ్రీకి సత్కారం



విద్యార్థిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

సామాన్యుడు సైతం అసామాన్యుడిగా ఉన్నత శిఖరాలు అవరోధించాలంటే విద్య ఒకటే ఏకైక మార్గమని గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు బిడిఎస్.సరస్వతి అన్నారు. శుక్రవారం సాయంత్రం పెనుమంట్ర మండలం పొలమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒంగోలు ట్రిపుల్ ఐటిలో స్థానం దక్కించుకున్న పిల్లిరత్న శ్రీని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని, క్రమశిక్షణతో కూడిన విద్య ఉన్నతమైందని ఆమె అన్నారు. మాజీ సర్పంచి, టిడిపి క్లస్టర్ నాయకులు చింతపల్లి రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయుల తర్ఫీదు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో రత్న శ్రీ మండలంలో ద్వితీయ స్థానంలో నిలిచిందని, అంతేకాక ట్రిపుల్ ఐటీ లో సీట్ సాధించి, పొలమూరు గ్రామ విద్యా ఘనత చాటిందని అన్నారు. విశ్రాంత టీచర్ బుంగా రాజశేఖర్ మాట్లాడుతూ రత్న శ్రీని ఆదర్శంగా తీసుకుని పదవ తరగతి విద్యార్థులు చదివి మంచి మార్కులు సాధించవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఆళ్ల రాము, సర్పంచి కాకర రాజేశ్వరరావు, టిడిపి అధ్యక్షులు పెనుమెత్స వివేక రాఘవేందర్ రాజు, బిజెపి గ్రామ అధ్యక్షులు యామజాల విశ్వనాథం, రాజశేఖర్, సత్యనారాయణ, ఎస్ఎంసి కమిటీ సభ్యులు కోడి చంద్రశేఖర్, పాండు రంగారావు, టి. రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుళాయిల ద్వారా మురుగునీరు

రంగు మారిన తాగునీరు

మొగల్తూరు : మొగల్తూరు సమగ్ర రక్షిత మంచినీటి పథకం నుంచి నీటి కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న శుద్ధి జలాలలో కలుషిత నీరు సరఫరా అవుతుంది. మొగల్తూరు పంచాయతీ ఆర్‌సిఎం చర్చి రోడ్డులో ఉన్న నీటి కులాయిల పైప్ లైన్ల నుంచి గత కొన్ని రోజులుగా మురుగునీరు సరఫరా అవుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. తాగు, ఇతర అవసరాలకు కుళాయి నీటిని వినియోగిస్తున్నామన్నారు. కుళాయిల ద్వారా మురుగునీరు సరఫరా కావడంతో తాము అనారోగ్యానికి గురవుతామని ఆందోళన చెందుతున్నారు. దుర్వాసన కూడా వెదజల్లుతుందని, సామాన్య అధికారులు తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

బాధితులకు పరామర్శ

తణుకు : అత్తిలి మండలం ఆరవల్లి గ్రామంలో మాలలపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని రిటైర్డ్ ఐఆర్ఎస్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఉప్పులేటి దేవిప్రసాద్ అన్నారు. శుక్రవారం అత్తిలి మండలం ఆరవల్లి గ్రామంలో మాలలపై జరిగిన దాడిని ఖండిస్తూ అఖిల భారత మాల సంఘాల(జెఎసి) ఆధ్వర్యంలో డాక్టర్ ఉప్పులేటి దేవిప్రసాద్ నాయకత్వంలో తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి, అనంతరం ఆరవల్లి గ్రామం వెళ్లి బాధితులను అడిగి సమాచారం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్తిలి మండలం ఆరవల్లిలో ఈనెల 23వ తేది సోమవారం సాయంత్రం పాత కక్షల నేపథ్యంలో రెండు సామాజిక వర్గాల మధ్య ఘర్షణ ఏర్పడి ఐదుగురికి తీవ్ర గాయాలైయ్యాయన్నారు. గాయపడిన వారిలో ముగ్గురు తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇద్దరు మేడపాటి నాని, మేడిద శ్రీనుల పరిస్థితి విషమించడంతో శ్రీనుని రాజమండ్రి ఆసుపత్రికి, నానాని ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి మెరుగైన చికిత్స కోసం తరలించారన్నారు. జరిగిన సంఘటనపై ప్రత్యేకమైన దర్యాప్తు చేయవలసిందిగా ఒక సిట్ ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. ఇక్కడ స్థానిక అధికారులపై అనేక ఆరోపణలు ఉన్న నేపథ్యంలో ప్రత్యేక అధికారులతో దర్యాప్తు చేయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎఫ్ఐఆర్‌లో కూడా మూడు పేర్లు మాత్రమే ఉన్నాయని, ఐదు పేర్లు ఉండాలని, రెండు పేర్లు తీసేశారని, ఆ రెండు పేర్లు వెంటనే ఎఫ్ఐఆర్‌లో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో మాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షులు తిర్రే రవిదేవా, అఖిల భారత మాల సంఘాల జెఎసి నాయకులు పాల్గొన్నారు.

మార్టేరు ఫారం పేరుతో నకిలీ వరి విత్తనాలు!

జాగ్రత్తపడమంటున్న ఎడిఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్

పెనుమంట్ర : మండలంలోని మార్టేరు ఆచార్య ఎన్‌జి.రంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం పేరు చెప్పి నకిలీ వరి విత్తనాలు అమ్మేవారి పట్ల జాగ్రత్తగా ఉండాలని స్థానిక ఫారం ఎడిఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ రైతులను నమ్మించి, వారి వద్ద నుంచి విత్తనాల కోసం డబ్బులు వసూలు చేయటం, కొంత మందికి నాణ్యత లేని నకిలీ విత్తనాలు సరఫరా చేయడం వంటి సంఘటనలు మా దృష్టికి వచ్చాయని అన్నారు. రైతులు అలాంటి వ్యక్తుల మోసపూరిత మాటలు నమ్మి మోసపోవద్దని, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానానికి సంబంధించి ఎలాంటి మధ్యవర్తులు లేరని తెలిపారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో విత్తనాలు కావలసిన వారు స్వయంగా పరిశోధనా స్థానానికి వచ్చి, సంబంధిత అధికారుల వద్ద నుంచి విత్తనాలు కొనుగోలు చేసి సంబంధిత కొనుగోలుకు సంబంధిత బిల్లు తీసుకోవాలని తెలిపారు. ఎవరైనా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సిబ్బందిమి అని చెప్పినట్లయితే రైతులు అప్రమత్తంగా ఉండి, వారి మాటలు నమ్మి మోసపోవద్దని తెలిపారు.

మహిళలు నైపుణ్యం పెంచుకోవాలి : ఎంపిడిఒ

ఆచంట : మహిళలు నైపుణ్యత పెంచుకుని ఆర్థిక పరిపుష్టి సాధించాలని ఎంపిడిఒ బిఎస్ఎస్.కృష్ణమోహన్ అన్నారు. స్థానిక కమ్యూనిటీ హాల్‌లో బిసి కార్పొరేషన్ ద్వారా మహిళలకు నిర్వహిస్తున్న టైలరింగ్ శిక్షణా కేంద్రాన్ని ఎంపిడిఒ బి.కృష్ణమోహన్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడుతూ శిక్షణ ద్వారా నైపుణ్యం పెంపుపొందించుకోవాలన్నారు. శిక్షణ పొందే వారికి కల్పిస్తున్న సదుపాయాలపై ఆరా తీశారు. ఆచంట వేమవరం నుంచి వచ్చే వారు ప్రయాణ ఖర్చుల కోసం అడుగగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరలో సానుకూల నిర్ణయం వచ్చేలా కృషిచేస్తానని తెలిపారు.

కౌలు రైతు అభ్యున్నతికే కౌలు రైతు పత్రాలు

ఉండి: కౌలు రైతుల అభ్యున్నతి కోసమే ప్రభుత్వం క్రాప్ కల్టివేటర్ రైట్ (సిసిఆర్‌సి) విధానాన్ని తీసుకొచ్చిందని మండల తహశీల్దార్ కావడి నాగార్జున, మండల వ్యవసాయ శాఖ అధికారి నిమ్మల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని కోలమూరు, ఎన్ఆర్‌పి అగ్రహారం, కలిసిపూడి గ్రామాల రైతు సేవా కేంద్రాలలో సిసిఆర్‌సి కార్డులపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విధానంతో కౌలు రైతులు బహుళ ప్రయోజనాలు పొందే అవకాశం వుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోలమూరు ఉపసర్పంచి నడింపల్లి రాంబాబు రాజు, ఎన్ఆర్‌పి అగ్రహారం ఉపసర్పంచి ముగ్గళ్ల సత్యనారాయణ, ఎంపిటిసిలు మున్నలూరి సువర్ణ లక్ష్మి శ్రీనివాస్ ఉన్నారు.

ఆకివీడు : మండలంలోని గుమ్ములూరు గ్రామంలో శుక్రవారం జరిగిన కర్యక్రమంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. గ్రామ సచివాలయం వద్ద మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వంటపాటి ఆంజనేయులు, గ్రామ రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఈ కార్డులు అందజేశారు. గ్రామంలో 75 మంది కౌలుదారులు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారని వారిలో 35 మందికి ప్రస్తుతం అందజేశామన్నారు. జూన్‌నెలాఖరులోగా మండలంలోని కౌలు రైతులందరికీ కార్డు అందజేయవలసి ఉందని తహశీల్దార్ నందూరి వెంకటేశ్వరరావు తెలిపారు.

విద్యా సామగ్రి పంపిణీ

కాళ్ల : ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు విద్యా సామాగ్రిని అందించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని పెదఅమిరం మెయిన్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.ప్రసన్న భారతి అన్నారు. శుక్రవారం పెదఅమిరం మెయిన్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు భీమవరంకు చెందిన రాజ్ ట్రస్ట్ వ్యవస్థాపకులు గంటా రాజ్‌కుమార్ విద్యార్థులకు రూ.25 వేల విలువైన నోట్ బుక్స్, స్లేట్స్ పంపిణీ చేశారు. ట్రస్ట్ సభ్యులు ఆనంద్‌కుమార్, సాగర్ బాబు, విజయకుమార్, ఉపాధ్యాయులు రంగా ప్రసాద్, వనజ, గ్లోరీ, ప్రసన్న పాల్గొన్నారు.

డాక్యుమెంట్స్ పోయినవి

ఏలూరు జిల్లా, నిడమర్రు మండలం, అడవికొలను గ్రామానికి చెందిన మాకిరెడ్డి దుర్గాప్రసాద్ S/o. సత్యనారాయణ అను నా యొక్క ఒరిజినల్ రిజిష్టర్ సెటిల్‌మెంట్ డీడి పోయినది. ఒరిజినల్ డీడి నెం.5248/2023. Dated 29-04-2022 ది. 20-06-2025వ తేదీన గణపవరం నుండి భీమవరం వెళ్ళుచుండగా దారి మధ్యలో నా యొక్క 5248/2023. నెంబరు గల ఒరిజినల్ రిజిష్టర్ సెటిల్‌మెంట్ డీడి పడిపోయినది. ఎంత వెతికిన దొరకలేదు. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

మాకిరెడ్డి దుర్గాప్రసాద్
S/o: సత్యనారాయణ
అడవికొలను,
నిడమర్రు మండలం, ఏలూరు జిల్లా
సెల్ నెం: 83330 37545

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, పెనుగొండ మండలం, సిద్ధాంతం గ్రామానికి చెందిన కాలాబత్తుల గ్లోరి, భర్త : రాజారత్నం అను నేను నా యొక్క పాస్పోర్ట్ పోయింది. సిద్ధాంతం ఇంటి దగ్గర నుండి నెట్ సెంటర్‌కు వెళ్తుండగా నా యొక్క పాస్పోర్ట్ నంబర్ : **M2385738** గల పాస్‌పోర్ట్ పడిపోయింది. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

కాలాబత్తుల గ్లోరి
భర్త: రాజారత్నం
డోర్ నెం: 2-81, సిద్ధాంతం
పెనుగొండ మండలం,
ప॥గో॥జిల్లా, పిన్: 534326
సెల్ నెం: 75691 00097

సర్టిఫికెట్ పోయినది

ఏలూరు జిల్లా, చింతలపూడి మండలం, పొనుకుమడు గ్రామానికి చెందిన మేనేని ధర్మ వీర వెంకట నాగ సత్య సాయి S/o దుర్గారావు అను నా యొక్క SSC ఒరిజినల్ సర్టిఫికేట్ పోయినది. సర్టిఫికెట్ నెం. జూన్-2023, Roll.No. 2311604734, గల SSC ఒరిజినల్ సర్టిఫికేట్‌ను ది. 21-06-2025వ తేదీన నా స్వగ్రామం అయిన పొనుకుమడు నుండి ఏలూరు వెళ్ళుచుండగా మార్గ మధ్యలో పడిపోయినది.ఎంత వెతికిన దొరకలేదు. కావున ఎవరికైన దొరికినచో ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

మేనేని ధర్మ వీర వెంకట నాగ సత్య సాయి
S/o: దుర్గారావు
పొనుకుమడు,
చింతలపూడి మండలం,
ఏలూరు జిల్లా,
సెల్ నెం: 93466 24034

PUBLIC NOTICE
IN THE COURT OF THE IIND ADDL CIVIL JUDGE (JUNIOR DIVISION), ELURU. W.G. DISTRICT.
O.S.No. 339/2024

Between:
Vadlapatla Vimala Devi ... **plaintiff**
And
Nunna Srilakshmi & Ors
...**Defendants**

To,
D7- Mareedu Kondala Rao,
S/o. Mareedu Rama Sastrulu,
D.No.1-143, Satrampadu,
Eluru, Eluru District.

Whereas, the plaintiff has filed suit for recovery of the amount due under the suit mortgage, whereas the Hon`ble Court ordered notice to your appearance. Therefore, you are called upon to appear before the Hon`ble Court on 30-06-2025 at 10.30 A.M., and state your objections if any, alse the matter will be decided in your absence.

PYDI VENKATA RAJU,
Advocate, Eluru
Eluru
Date: 27-06-2025
Cell: 98851 99811